క్లుప్తంగా

ఆశ్రమాలకు దాతల చేయూత



మేరి వృద్ధాశ్రమం నిర్వాహకులతో దాతలు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని మేరి వృద్ధాశ్రమంలో వృద్ధులకు, చేయూత అనాథ పిల్లల ఆశ్రమంలో పిల్లలకు ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ మారంరెడ్డి అభిజ్ఞ, డాక్టర్ సుదీప్ రెడ్డి దంపతులు శనివారం చేయూత అందించారు. వారి కుమారుడు ఆరవ్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. ఆశ్రమంలో ఉన్నవారికి భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. ఆశ్రమ నిర్వాహకులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలతోపాటు నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావుకు ఘన నివాళి



నాయుడుపేటలో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల తదితరులు

నాయుడుపేట టౌన్: రామోజీ ఫిలింసిటీ, ఈనాడు పత్రిక అధినేత రామోజీరావు మృతిపై పలువురు నేతలు శనివారం ఘన నివాళులర్పించారు. పట్టణంలోని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం నివాసం వద్ద ఆయనతోపాటు సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, నాయకులతో కలిసి రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి, సంతాపం వ్యక్తం చేశారు. పాత బస్టాండు సమీపంలో రామోజీరావు ఫ్లెక్సీ ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రామోజీకి సైకత నివాళి



రామోజీ సైకత శిల్పం రూపొందిస్తున్న మంచాల సనత్‌కుమార్

చిల్లకూరు: పత్రికా రంగంలో పెను మార్పులు తీసుకుని వచ్చిన రామోజీరావు శనివారం మృతి చెందిన సందర్భంగా ఆయనకు చిల్లకూరు మండలం ఏరూరు గ్రామానికి చెందిన సైకత శిల్పి మంచాల సనత్‌కుమార్ తనదైన శైలిలో నివాళులర్పించారు. మండలంలోని ఏరూరు సమీపంలో ఉన్న సముద్ర తీరంలో రామోజీ సైకత శిల్పాన్ని రూపొందించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రిక, మీడియాలతోపాటుగా చిత్ర పరిశ్రమల్లో ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పించిన రామోజీ మృతి పలువురికి తీరని లోటు అని అన్నారు.

రామోజీరావు మరణం తీరని లోటు

వెంకటగిరి(సైదాపురం): ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మరణం తీరని లోటని వైఎస్ఆర్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రామోజీరావు మృతిపై ఆయన శనివారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఆయన తెలుగు భాషకు ఎంతో ప్రాముఖ్యత తెచ్చారని కొనియాడారు.

ఆగమోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శ్రీశనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. కల్యాణ వెంకన్న ఊంజల్ సేవ

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ ప్రసిద్ధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం దేవదేవేరులు ఊయ్యాల సేవలో భక్తులను అనుగ్రహించారు. వేకువజామున సుప్రభాత సేవతో శ్రీస్వామివారిని మేల్కొలిపి నిత్యపూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదా లను అందుకున్నారు. సాయంత్రం కైంకర్యాలను పూర్తి చేసిన అర్చకులు శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చిపై అధిష్టింపజేసి ఊరేగింపుగా ఊంజల్ మండపానికి వేంచేపు చేసి ఊయలలో కొలువుదీర్చారు. అనంతరం వేదనాద కచేరీల నడుమ స్వామి,అమ్మవార్లు ఊయలలో సేదతీరుతూ భక్తులను దర్శనమిచ్చారు.

ప్రజా తీర్పును శిరసావహిస్తాం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మేరిగ మురళీధర్

గూడూరు రూరల్: ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తామని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. సనత్‌నగర్‌లోని ఆయన నివాసంలో శనివారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి అందించినప్పటికీ ప్రజలు ఎన్నికల్లో వైఎస్ఆర్ సీపీకి వ్యతిరేకంగా తీర్పును ఇచ్చారని అన్నారు. గూడూరు నియోజకవర్గంలో వైఎస్ఆర్ సీపీ 20 వేల ఓట్లు వెనకబడిందన్నారు. అయితే గత ఎన్నికల్లో 40 వేల పైచిలుకు ఓట్లుతో ప్రస్తుత టీడీపీ ఓటమి పాలైందని ఇది గుర్తు చేసుకోవాలని అన్నారు. తిరుపతి ఎంపీ గురుమూర్తికి అదే 20 వేల ఓట్లు ఇక్కడ నుంచి మెజారిటీ వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం గెలిచిన ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు అభినందనలు తెలియజేస్తున్నామని, గూడూరు నియోజకవర్గం అభివృద్ధి విషయంలో తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. గూడూరు మండలంలోని తిప్పవరప్పాడు చెరువులోని తుమ్మ చెట్లు నరికి వేతకు సంబంధించి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆరోపణలు చేశారని ఇది పూర్తిగా అవాస్తవమన్నారు. చెట్లు నరికిన వ్యక్తి వైఎస్ఆర్ సీపీకి సహకరించారనే నెపంతో ఇలా మాట్లాడడం సరికాదని అన్నారు. అధికారుల పర్యవేక్షణలోనే టెండర్లు పిలిచిన అనంతరమే చెట్లను నరికారన్నారు. దీనిపై ఎలాంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నామని అన్నారు. కార్యకర్తలు ఎక్కడ కూడా ఆవేశాలకు పోకుండా సంయమనం పాటించాలని అన్నారు. ఎమ్మెల్సీ పదవిలో కొనసాగుతామని అన్నారు. గూడూరు గాంధీనగర్‌లో వైఎస్ఆర్ సీపీ కార్యాలయానికి 150 అంకణాల స్థలం కేటాయించారని ఎమ్మెల్యే ఆరోపించారని, అలాంటిది ఏదైనా ఆయనే దానిని స్వాధీనం చేసుకోవచ్చని అన్నారు. అనంతరం పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు మాట్లాడుతూ ధర్మరాజుల దేవస్థానం చైర్మన్‌గా ఉన్న తాను, కమిటీ సభ్యులు రాజీనామాలు చేస్తామని తెలిపారు.

శ్రీలక్ష్మీనరసింహ స్వామికి పల్లకీ సేవ



పల్లకీ సేవకు సిద్ధంగా ఉన్న శ్రీలక్ష్మీనరసింహ స్వామి, అమ్మవార్లు

చిల్లకూరు: మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శనివారం పల్లకీ సేవ నిర్వహించారు.ఆలయంలో ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీలతోపాటుగా స్వామి వారికి ఉదయం సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం పలు రకాల అభిషేకాలు చేపట్టారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు. సాయంత్రం స్వామి అమ్మవార్లకు పల్లకీ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా నెల్లూరుకు చెందిన శ్రీకళ వ్యవహరించారు. ఆలయ ఈఓ తాతా శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు, యువత భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పర్యవేక్షించారు.

శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి

నాయుడుపేట టౌన్: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న శ్రీవ్యూహలక్ష్మీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద ఉదయం నుంచి స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు జరిపి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఈ పూజలలో భక్తులు, సుబ్రహ్మణ్యం పీఠం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కూలే స్థితిలో పాఠశాల భవనం



వెదురుపట్టులో పాఠశాల భవనం దుస్థితి

దొరవారిసత్రం: వెదురుపట్టు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల భవనం కూలే స్థితిలో ఉంది. ఎప్పుడు ఏం జరుగుతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ భవనం గత కొన్నేళ్లు కిందటే శిథిలావస్థకు చేరుకోవడంతో మూత బడింది. ఈ భవనం ప్రస్తుతం ఉన్న పాఠశాలకు ఆనుకుని, ఇళ్లకు సమీపంలో ఉంది. ఇక్కడే పిల్లలు ఆడుకుంటూ ఉంటారు. ఎక్కడ కూలిపోతుందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. దీన్ని కూల్చేమని స్థానికులు సంబంధిత అధికారులకు పలు మార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలియజేశారు.

రేపు హనుమాన్ శోభాయాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ నేతలు

వెంకటగిరి రూరల్: హనుమాన్ జయంతి పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు పట్టణ అధ్యక్షుడు వడ్లమూరి భాస్కర్, ప్రఖండ అధ్యక్షుడు నర్రా రవి పిలుపునిచ్చారు. పట్టణంలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ సాయంత్రం 4 గంటలకు హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎంఈసీ గ్రూపులో ఖాళీలు భర్తీ

వెంకటగిరి రూరల్: వెంకటగిరి పట్టణంలోని ఏపీ ఆర్ జూనియర్ కళాశాల(బాలుర)లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ శారదబాయ్ చౌదరి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సీఈటీ-2024 ప్రవేశ పరీక్షలకు హాజరై ఎంఈసీ గ్రూపులో ప్రస్తుతం సీట్లు లభించని వారికి ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. మొదట వచ్చిన వారికి తగిన ప్రాధాన్యం ఇచ్చే ప్రక్రియ జరుగుతున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 87126 25075 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కండలేరులో 6.544 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 6.544 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 40, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కాశీ క్షేత్రంలో లోకక్షేమం కోసం విశేష హోమాలు





కాశీలో పూజలు నిర్వహిస్తున్న అర్చక బృందాలు, కాశీలోని కేదార్ ఘాట్‌లో హోమాలు నిర్వహిస్తున్న అర్చక బృందం

వాకాడు: చిట్టమూరు మండలం మల్లాం గ్రామంలో వెలసిన కామాక్షిదేవి సమేత మార్కండేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు గూడలి సుధీర్ శర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం లోకక్షేమం కోసం మూడు రోజులుగా కాశీలో విశేష హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌శర్మ శనివారం వాకాడులో మాట్లాడుతూ లోకక్షేమంతోపాటు సర్వజనుల శ్రేయస్సు కోరుతూ కాశీక్షేత్రంలో గత మూడు రోజులుగా విశేష హోమాలు, సత్యనారాయణస్వామి వ్రతం, నవగ్రహ హోమం, మహాగణాధిపతి హోమం, రుద్రహోమం, మృత్యుంజయ హోమం, కాలభైరవ హోమం, మహాపాశుపత హోమం, లక్ష్మీకుబేర హోమం, కాశీవిశ్వనాథునికి మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, అన్నపూర్ణాదేవికి కుంకుమపూజ వైభవంగా నిర్వహించారు. ఈ పూజల్లో కాశీలోని ప్రముఖ పండితుడు నుదురుపాటి పార్వతీశం శర్మతోపాటు గూడలి చంద్రశేఖర్‌శర్మ, సరస్వతుల సుబ్రమణ్యం శర్మ, జనమంచి పవన్‌కుమార్‌శర్మ, గూడలి నవీన్ బ్రహ్మశర్మ, షణ్ముఖ హర్షిత్‌శర్మ పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా పాఠ్య పుస్తకాలు

- 5 వేల మందికి పైగా విద్యార్థులకు లబ్ధి



లారీలో దిగుతున్న విద్యార్థుల యూనిఫారాలు



చేరిన పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న అధికారులు



జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో భద్రపరిచిన నోట్ బుక్స్

సూళ్లూరుపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పైసా ఖర్చు లేకుండా నాణ్యమైన విద్యకు భరోసాగా నిలిచిన గత ప్రభుత్వ ముఖ్యమంత్రి జగనన్న విద్యాకానుక(జేవీకే) కిట్లు సూళ్లూరుపేట మండలానికి చేరుకున్నాయి. విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు ఉద్దేశించి స్టూడెంట్ కిట్లను తీర్చిదిద్దిన నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు ముద్రణల సంస్థల నుంచి విడతలవారీగా వస్తున్నాయి. వచ్చిన విద్యాసామగ్రిని సూళ్లూరుపేట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారులు భద్రపరిచారు. వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో నాలుగేళ్లుగా అందుతున్న జగనన్న విద్యాకానుక స్టూడెంట్ కిట్లు వరుసగా ఐదో ఏడాది కూడా వచ్చి చేరాయి. పాఠశాలలు తెరిచిన రోజున విద్యార్థులకు అందనుంది. మండల పరిధిలో 76 పాఠశాలలకు గాను ఎనిమిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. 2023-2024 విద్యాసంవత్సరానికి 5,804 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు కొంత మేర ఇంగ్లీషు, గణితం, తెలుగు, హిందీ రీడర్లు, వర్కు బుక్స్‌తో పాటు ఈవీఎస్ ఎస్-1 తదితర 7517 పాఠ్య పుస్తకాలు వచ్చి చేరాయి. ఇంకా రావాల్సి ఉంది. దీంతో ఆరో తరగతి విద్యార్థులకు అన్ని రకాల పాఠ్య పుస్తకాలు 4176 పాఠ్యశాలలు ఉన్నాయి. అలాగే 14,893 నోట్ బుక్స్, 5,435 మందికి విద్యార్థులకు యూనిఫారాలు అందాయని మండల విద్యాశాఖాధికారులు శ్రీనివాసులురెడ్డి, శీనయ్యలు తెలిపారు. రావాల్సిన పుస్తకాలు ఉన్నాయని ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభం కానుంది. ఈలోపు మిగిలిన పాఠ్యపుస్తకాలు వస్తాయని అధికారులు తెలిపారు.

వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి

నాయుడుపేట టౌన్: వైఎస్ఆర్ సీపీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి అంతా అండగా ఉంటామని, ఎవరూ అధైర్య పడవద్దని ఆ పార్టీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నివాసం వద్ద శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎవరూ ఊహించని విధంగా పార్టీ ఓటమి చెందడం చాలా బాధ కలిగించిందన్నారు. అయినప్పటికీ ప్రజలు ఇచ్చిన తీర్పును అందరూ గౌరవించాలన్నారు. పార్టీ ఓటమికి నైతిక బాధ్యతగా తన మండల కన్వీనర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు సుబ్రహ్మణ్యం రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు రాజీనామా లేఖను పార్టీ జిల్లా అధ్యక్షుడికి పంపినట్లు తెలిపారు. పదవికి రాజీనామా చేసినప్పటికీ పార్టీ కోసం నిరంతరం ప్రజల మధ్య ఉంటు పని చేస్తానన్నారు.

ముగిసిన వేసవి శిక్షణా శిబిరాలు



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు పంపిణీ

వెంకటగిరి రూరల్: పట్టణంలోని తూర్పువీధిలో ఉన్న మహాత్మగాంధీ గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలు శనివారంతో ముగిశాయి. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు 23 రోజులపాటు నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరాలు ముగింపు సందర్భంగా వెంకటగిరి ఎంఈఓలు వెంకటేశ్వర్లు, బాబయ్య పాల్గొన్నారు. ఈ మేరకు విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వోదయ కళాశాల అధ్యాపకులు వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు గుర్రాల రమేష్, రత్నశేఖర్, రమణయ్య, గ్రంథాలయ అధికారి అంజయ్య, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

రాపూరులో భారీ వర్షం



రాపూరులో కురుస్తున్న వర్షం

రాపూరు: రాపూరులో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వేసవి తాపానికి అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగేలా వాతావరణం మారింది. ఉదయం నుంచి ఎండ వేడిమికి, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు వర్షం కురవడంతో సేదదీరారు. వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. కొంత సమయం విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

40 మందితో జూనియర్ ఇంటర్ తరగతులు



చిట్టమూరు మండలం మెట్టులో జూనియర్ ఇంటర్ తరగతులను ప్రారంభిస్తున్న ఎంఈఓ తదితరులు

చిట్టమూరు(చిల్లకూరు): చిట్టమూరు మండలం మెట్టు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి జూనియర్ ఇంటర్ తరగతులను 40 మంది విద్యార్థులతో ఆరంభిస్తున్నట్లు వాకాడు ఎంఈఓ డాక్టర్ నసీం ఆలీ తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న జూనియర్ ఇంటర్మీడియెట్‌కు సంబంధించి ఎంపీసీలో 30 మంది, బైపీసీలో 10 మంది విద్యార్థులు చేరుతున్నారని అన్నారు. వీరికి తరగతులను ఆరంభించే ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ పార్థసారథి, నరేష్‌రెడ్డి, నాగూర్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి, శశిధర్ రెడ్డి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, శ్రీనివాసులు, సంతోష్, ఖాదర్, ఎస్.శ్రీనివాసులు, సుబ్బయ్య, పద్మావతి, శ్రీలక్ష్మి, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా సీతారాముల కల్యాణం



శ్యాంసుందరపురంలో సీతారాముల కల్యాణం

కోట: పంచాయతీ పరిధిలోని శ్యాంసుందరపురంలో శ్రీఅభయ ఆంజనేయస్వామి దేవస్థానం ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు, భక్తుల సహాయసహకారాలతో ప్రధాన అర్చకులు దీవి అనంతాచార్యులు వైఖానస ఆగమోక్తంగా కల్యాణ వేడుకను జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త నల్లపురెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, శరవణ, చంద్రప్రసాద్‌నాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అల్పాహారం పంపిణీ



కుప్పారెడ్డిపాళెం మహెర్ సంస్థలో నిరాశ్రయులకు అల్పాహారం అందిస్తున్న సర్పంచ్ బ్లెస్సీ

దొరవారిసత్రం: సూళ్లూరుపేట చెంగాళమ్మ ట్రస్ట్ బోర్డు చైర్మన్, వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దువ్వూరు బాలచంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం ఏకొల్లు పంచాయతీ సర్పంచ్ బ్లెస్సీ కుప్పారెడ్డిపాళెం గ్రామ పరిధిలోని నిరాశ్రయుల మహెర్ సంస్థలో కేక్ కట్ చేసి 120 మందికి అల్పాహారం ఏర్పాటు చేశారు. అదే విధంగా ఆశ్రమంలో ఉన్న చిన్న పిల్లలకు దుస్తులు కూడా ఏర్పాటు చేస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.